


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## (గత సంచిక తరువాయి)

''నాకు వివాహం జరిగింది అనూజ్ఞా. నేను నీకు సిమ్లాలో చెప్పింది నిజమే. నాకు వివాహం జరిగిన సంగతి మీ నాన్నగారికి కూడా తెలుసు. నేను వివాహితుణ్ణి, నా భార్య పేరు కళ్యాణి.''

ఆమె క్లుప్తంగా ''తెలుసు'' అంది.

❦❦❦

ఒక దట్టమయిన చీకటి రాత్రి, నడి సముద్రంలో దిక్సూచి పాడై చివరికి చందమామ కూడా మబ్బుల వెనుక కనపడక పోతే ఆ సరంగు ఎలా తడబడతాడో అలా అతడు నిర్విణ్ణుడయ్యాడు.

ఆమె తల వంచుకుని చెప్పింది. ''అవును, నాన్నగారు చెప్పారు.''

అతడింకా షాక్‌నుంచి తేరుకోలేదు. ఆమె కొనసాగించింది. ''... మొన్నటి వరకూ మీరు చెప్పేదంతా కథ అనుకున్నాను. షోలేలాటి కథ నేను చెబితే, దానికి సమాంతరంగామీరీ కథ చెపుతున్నారనీ, పెళ్ళికి ముందే భార్య వళ్ళంతా చచ్చుబడి ఉండటం ఏమిటనీ అనుకున్నాను'' ఆమె ఆగింది. ''నేను మిమ్మల్ని ఎంతగా ప్రేమిస్తున్నానో, నా ప్రేమ సంగతి చెప్పే సమయానికి నాకు హడ్జ్కిన్స్ డిసీజ్ అన్న అభిప్రాయంలో ఉన్నారు. చనిపోతున్న కూతురి కోసం యాభై లక్షలు ఖర్చు పెట్టబోతున్నారని తెలీదు. మన పరిచయం ఎలా అయిందో, రక్తంతో బొమ్మ ఎలా వేసామో – అంతా చెప్పాను. 'అయితే అతనితో మరో బొమ్మ వేయిస్తానని వాగ్దానం తీసుకున్నావన్న మాట' అన్నారు నాన్నగారు. ఆ ఆలోచన నాకెప్పుడో ఉందనీ, సిమ్లాలో మరణిస్తున్నట్టు నటించినప్పుడు ఆ వాగ్దానం తీసుకున్నాననీ అన్నాను. ఆ విజయం సాధించాకే మన వివాహం అయితే బావుంటుందనీ ఆయన సూచించినప్పుడు నాకు అది చాలా మంచి ఆలోచన అనిపించింది. అయితే ఆయన మన వివాహాన్ని నా మరణం అవతలి వైపుకు తోసే ప్రయత్నం చేస్తున్నారని నాకు తెలీదు. నా జీవితపు ఆఖరి క్షణాలు అద్భుతంగా ఉండాలని ఆయన తన స్నేహితుడిని అడిగి ఈ దీవి, నా చుట్టూ ఈ అందమైన వాతావరణమూ కల్పించారని ఊహించలేకపోయాను. అదంతా మీకు నా మీద ఉన్న ప్రేమ అనుకుని పొంగిపోయాను. నా సంతోషం కోసం మీరిద్దరూ మౌనంగా ఉన్నారని నాకు తెలీదు'' ఆమె ఆగి, చెప్పటం సాగించింది. ''... అయితే నాకే జబ్బూ లేదని తెలిశాక నాన్నగారి నిర్ణయం మారిపోయింది. నేను మీతో ఇక్కడికి రావటానికి ఒప్పుకోలేదు. నేను నాన్నగారితో గట్టిగా దెబ్బలాడాను.

అప్పుడాయన మీకు వివాహం అయిందన్న అసలు విషయం చెప్పారు...'' భరించవలసిన వేదనంతా ముందే భరించినట్టు ఆమె కంఠం ఒక నిర్వేదానికి లోనైంది.

ఆమె ఏం చెపుతూందో అర్థంకాక అతడు ఆమెవైపు చూశాడు. ఆమె తలవంచుకుని చెపుతోంది. కిటికీలోంచి పడే వెలుగులో ఆమెకు ఒకవైపు మాత్రమే తెలుస్తోంది. అతనికి కనపడే వైపంతా చీకటిగా ఉంది. ఆ మసక చీకటిలో ఆమె స్వరం మంద్రంగా వినిపించింది.

''వాస్తవం తెలిసి నేను విభ్రాంతి చెందాను. మీకు వివాహం అయిందన్న విషయం తెలిసి కాదు. మీ భార్య గురించిన విషయం తెలిసి..! ఎన్నో రాత్రులు నాలో నేనే కుమిలిపోయాను. నా కోసం కాదు మిత్రాజీ. మీ కోసం..! కళాకారులకి రిలాక్సేషన్ ఎలా దొరుకుతుందో నాకు తెలుసు. పక్క నుంచి అభినందన కావాలి. పూలూ, గాలీ, లతలూ, తరులూ అన్నీ ప్రేరణ ఇవ్వగా లేనిది మనిషి ఇవ్వలేకపోతే అది చాలా దురదృష్టకరం. 'అచేతన' కారణంగా ప్రేరణ ఇవ్వలేకపోతే, మానసికంగా ఇవ్వొచ్చుగా. వ్యాపారం చేసే మేనేజర్లు ఎక్కడైనా దొరుకుతారు. కళాకారులు దొరకరు. ఎవర్ని ఏ పనికి ఉపయోగించుకోవాలో...  క్షమించండి. వేరొకరి గురించి మాట్లాడే అర్హత నాకు లేదు. మీ స్థితిపట్ల నా ఆలోచన చెపుతున్నానంతే...''

''ప్రేమ జాలి వల్ల పుట్టదు'' కటువుగా అన్నాడు.

''నేనా మాట అనలేదు. ఒక అపూర్వ సృష్టికి అహోరాత్రులూ కృషిచేసి, ఆ యుద్ధం పూర్తయి విజయం సాధించాక, కళాకారుడికి, 'పరిపూర్ణమైన' విశ్రాంతి లభిస్తే తప్ప మరో యుద్ధానికి తయారవలేదు అంటున్నాను. 'సెక్స్ అండ్ బ్రెయిన్' పుస్తకంలో రచయిత అదే చెబుతాడు. ఆర్టిస్టు తన పనిలో తాను లీనమై, నిరంతర ఘర్షణకు లోనవుతూన్నప్పుడు శారీరక, మానసిక ఎజాక్యులేషన్స్ లేకపోతే ఉన్మాద స్థితికి చేరుకుంటాడట.''

కార్తికేయ మొహం జేవురించింది. హర్ట్ అయినట్టు ''నేను దానికోసం ఎప్పుడూ దిగజారలేదు'' అన్నాడు.

''మీ చుట్టూ ఉన్న నైతిక విలువల కోట గట్టిది కాబట్టి దిగజారలేదు. కానీ నేనిక్కడికి వచ్చి చూచేసరికి జరుగుతున్నదేమిటి? మీరొక శిథిలాలయంలో ఉన్నారు. కాదనగలరా?''

''దానికి కారణం నువ్వనుకున్నట్టు శరీరం కాదు'' అనబోయి, నిజం ఫడేలున కొట్టటంతో ఆగిపోయాడు. ఆమె అన్నది– ''మీలో ప్రేరణ కలిగించే ప్రయత్నంలో నేను ప్రేరణ పొందాను. మీ ప్రేమ నా మనసుని ఎప్పుడో స్పర్శించింది. మీ చూపు స్పృశించిన ఈ దేహం కూడా ఇప్పుడు మీదే అనుకున్నాను. తప్పా?''

''నువ్వేం మాట్లాడుతున్నావో నీకు అర్థమవుతోందా?''

అనాచ్ఛాదిత శరీరాన్ని కప్పుకుంటూ ''సున్నితమైన ఇటువంటి అనుభూతుల గురించి 'మాటల్లో' చర్చించవలసి రావటమంత  దురదృష్టకరమైన విషయం మరొకటి లేదు'' అన్నది.

''మాటల కన్నా మంచి కమ్యూనికేషన్ స్వభావసిద్ధంగా రానప్పుడు, మన ఆత్మవంచన తగ్గించుకోవటం కోసం మాటలే మంచివి కదా. ప్రేమించటానికి కూడా అవతలివారిలో కొన్ని అర్హతలు చూడాలి.''

''మీకు వివాహం కావటం అనర్హతా?'' ఆమె తలెత్తి సూటిగా చూసింది. ''ఇదెక్కడికి దారితీస్తుందో అని కంప్యూటర్‌తో లెక్కలు కట్టి చేసేది కాదు ప్రేమంటే..! భవిష్యత్తులో ఫుల్‌స్టాప్ ఎక్కడుంటుందో తెలియని వాక్యానికి మొదటి అక్షరం ప్రేమ".

"కానీ నేను... నేను... నా.... అర్హత..." తడబడ్డాడు. తరువాత ఏమి చెప్పాలో తెలియలేదు. ఆమె చెప్పి రక్షించింది.

"ప్రేమించాక అవతలి వారి అర్హతలూ అనర్హతలూ ఎవరూ బేరీజు వెయ్యరు. ఈ ప్రపంచంలో స్వార్థం లేని ఒకే ఒక ట్రాన్సాక్షన్ 'ప్రేమ'. తన కడుపులో బిడ్డ ఎలాటి అర్హతలతో పుడతాడో ఏ తల్లీ స్కానింగ్ చేయించుకోదు. ప్రేమకి క్వాలిఫికేషన్లు ఉండవు. తొమ్మిది నెలలుగా కడుపులో పెరుగుతున్న శిశువు పట్ల ప్రేమని పెంచుకున్న తల్లి, ఆ శిశువు అంగవైకల్యంతో పుడితే ప్రేమను చంపేసుకోదు. 'మరింత' ఆప్యాయతతో, సానుభూతితో, ప్రేమతో అక్కున చేర్చుకుంటుంది.''

''ఇలాంటి గారడీ మాటలు మనకి మనం నచ్చచెప్పుకోవటానికి సాయపడతాయి తప్ప మరెందుకూ కాదు.''

''అయితే మీకు నాపట్ల ప్రేమ లేదా?''

''ఇష్టం ఉంది.''

ఆమె స్వరం హెచ్చించి ''ప్రేమ లేదా?'' అని అడిగింది.

''అంటే?'' అన్నాడు.

ఆమె దానికి వివరణ ఇవ్వకుండా చప్పున దగ్గరకొచ్చి అతని చెయ్యి తీసుకుని తల మీద ఉంచుకుని, ''చెప్పండి మీరు నన్ను ప్రేమించటం లేదని'' అంది. ఈ ఆకస్మిక చర్యకి అతను విస్తుబోయాడు. దూరంగా ఎక్కడో సముద్రం మీద ఒక మేఘం మరో మేఘాన్ని ఢీకొని ఉరుముతో కంపించింది. నీరు... నీరులో కలవటానికి ఇంత యుద్ధమెందుకన్నట్టు సముద్రం చల్లగాలితో కబురు పంపింది.

అతడు ఆమె తలమీద నుంచి చెయ్యి తీస్తూ ''వద్దు అనూజ్ఞా. అంతర్‌లోచనంకన్నా పెద్ద వ్యధ మరొకటి లేదు. నన్ను ఇబ్బంది పెట్టకు. నేనేమీ ఆలోచించే స్థితిలో లేను. ఆలోచించటం ఇష్టంలేదు కూడా'' అన్నాడు.

''నాకు సమాధానం కావాలి.''

''నాకు తెలీదన్నాగా.''

''కాదు. మీకు తెలుసు. ఎస్కేప్ అవుతున్నారు.''

అతడు నెమ్మదిగా తల పైకెత్తాడు. అతడి మొహం కఠినంగా మారింది. తన భావాలన్నిటినీ కూడగట్టుకున్నట్టు, ఒక రకమైన నిర్దిష్టతతో ''నా భార్య శారీరక అవలక్షణం గురించి గానీ, మా ఇద్దరి మానసిక సామీప్య, దూరాల గురించి

ఇంకెవరితోనూ చర్చించటం నాకు ఇష్టం లేదు. ఆమె పట్ల నేను నిజాయితీగా ఉండటానికీ, ప్రేమ చూపించటానికి ఆమె 'నా భార్య' అన్న ఒక్క అర్హతా చాలు'' అన్నాడు.

అతడిలో అంత కాఠిన్యాన్ని అంతకు ముందెప్పుడూ చూడని ఆమె ''క్షమించండి. మిమ్మల్ని రెచ్చగొట్టాను'' అని అక్కడనుంచి కదలబోయింది.

అతడు నొచ్చుకుంటూ, ''అనూజ్ఞా'' అన్నాడు. ఆమె ఆగింది. "ఇదంతా నేను నా గురించి కాదు, నీ గురించి చెపుతున్నాను. నన్ను అర్థం చేసుకో'' అన్నాడు.

''నేనేం చెయ్యాలని మీ ఉద్దేశ్యం.''

''వీలైనంత త్వరగా ఇదంతా మర్చిపోయి వివాహం చేసుకో.''

''దాని వల్ల మీకేమిటి లాభం?'' అతడివేపు చూడకుండా అంది. అతడు దెబ్బతిన్నట్టు ''అనూజ్ఞా'' అన్నాడు. ఆమె కాస్త వెటకారంగా ''ఒక కూర బావోలేకపోతే వదిలేసి ఇంకో కూర తినటానికి ఇదేమి విందు కాదు. ప్రేమ'' అంది.

''కానీ...'' అతడి మాట పూర్తికాకుండా ఆమె అడ్డు తగిలింది. ''మీ నైతిక విలువలు మీకు ఉండొచ్చు గాక. మిమ్మల్ని ఇబ్బంది పెట్టకుండా మిమ్మల్ని ప్రేమించుకుంటే, నన్ను అభ్యంతర పెట్టే హక్కు మీకు లేదు.''

''కానీ నిన్ను నువ్వు పోగొట్టుకుని...'' అంటూ అతడేదో అనబోతోంటే ఆమె తలెత్తి ''...మీ దంపతుల గురించి ఎవరితోనూ చర్చించటం మీకెలా ఇష్టం ఉండదో, నా గురించి ఎవరైనా సానుభూతి చూపించటం నాకూ ఇష్టం ఉండదు.''

కొరడాతో కొట్టినట్టయింది. అతడిని పట్టించుకోకుండా ''ఏ శారీరక సుఖమూ లేకపోయినా భార్యతో కలిసి ఉండటం మీ దృష్టిలో మానవత్వమయితే, శారీరక సుఖం కోసం ప్రేమ వొదులుకుని వేరే వ్యక్తిని వివాహమాడటం నా దృష్టిలో మానసిక వ్యభిచారం'' అంది. 'అనూజ్ఞా' అని గట్టిగా అరిచాడు. ఆమె ఆగలేదు. ''నిరంతర త్యాగంతో ఆనందం పొందే మీరు, నిరంతర ప్రేమలో ఉండొద్దని నాకెలా చెప్పగలరు? నేనేదో కోల్పోతున్నానని, అన్నీ కోల్పోయిన మీరు ఎలా అనగలరు?''

అతడు వెంటనే సమాధానం చెప్పలేదు. ఆమె దగ్గరకి వెళ్ళి అనునయంగా భుజం మీద చెయ్యి వేశాడు. ''నీలో ఇంత కోపం, దుఃఖం, కసి... ఇవేమీ బాగా లేవు అనూజ్ఞా. నువ్వు అల్లరిగా, చిలిపిగా ఉంటేనే అందం. ఇంత అందమూ తెలివితేటలున్న అమ్మాయి ఒక భార్యగా, ఒక తల్లిగా... ఒక మనిషికీ, ఒక కుటుంబానికీ ఎంతో సుఖమిస్తుంది. నువ్వు ఇలా ఉండిపోతే ఇకపై నేను ఇక జీవితాంతం దుఃఖం అనుభవిస్తూనే ఉండాలి. నీ ప్రేమని మొదట్లోనే తృంచకుండా, చూసీ చూడకుండా ఊరుకున్నానన్న తప్పు నా మనస్సుని తొలిచేస్తుంది. నా కోసమైనా, కనీసం నా కోసమైనా నీ భవిష్యత్తు బాగుచేసుకో...''

ఆమె అతడి కళ్ళలోకి సూటిగా చూస్తూ ''నా భవిష్యత్తు బావుండటమే కదా మీకు కావాల్సింది'' అంది.

''అవును.''

ఆమె తడికళ్ళ వెనుక ఒక చిన్న చిరునవ్వు. ''మీ భార్యకి తెలియకుండా మనిద్దరం కలిసి ఉంటే నా భవిష్యత్తంతా...''

''అనూజ్ఞా. పరిహాసాల కిది సమయం కాదు.''

''ఎవరికీ ఇబ్బంది కలిగించకుండా మనం ఆనందంగా ఉండటంలో తప్పేముంది?''

''నువ్వేం మాట్లాడుతున్నావో నీకు అర్థమవుతోందా? రాచరికంతో బ్రతకాల్సిన నీ భవిష్యత్తుని ఇలా దొంగచాటు వ్యవహారం చేస్తావా?''

''ఏది నైతికమో, ఏది అనైతికమో నిర్ణయించేది ఏది?''

ఆమె ఎందుకు అడిగిందో అర్థంకావటంలేదు. ''ధర్మం'' అన్నాడు.

''ధర్మాన్ని ఎవరు పెట్టారు?''

''దేవుడు.''

ఆమె ఒక్కసారిగా బరస్ట్ అయింది. ''దేవుడు..! ధర్మం..! ఏమిటి ఈ దేవుడి ధర్మం? ప్రేమ పూర్తిగా ఫలించక ముందే నాశనం చేయటం దేవుడి ధర్మమా? జీవితం పూర్తిగా వికసించకముందే వెనక్కి పిలిపించుకోవటం దేవుడి ధర్మమా?''

మెరుపులతో సముద్రం మీద వర్షం ఒక్కసారిగా పెద్ద ఎత్తున మొదలైంది. భరించలేనంత వెలుగుల గజిబిజిరేఖలు, అస్పష్టంగా అతడి మొహంమీద ప్రతిబింబిస్తుండగా, ఏదో ఒక చిన్న అనుమానం గుండెల్నిండా రాక్షసిలా ఆక్రమించుకుంటూండగా అతడు తడారిన గొంతుతో అడిగాడు. ''అనూజ్ఞా నువ్వు చెప్పేది?''

''నా భవిష్యత్తు గురించి...'' ఆమె ఆలోచన్లు ఆ రోజు జరిగిన సంఘటనలోకి వెళ్ళాయి.

''అసంభవం'' అన్నాడు డాక్టర్ భరద్వాజ. అతడి మొహం ఎర్రగా జేవురించింది.

''అవును డాక్టర్‌గారూ. ఇదే వ్యాధి ఉన్న మరో పేషెంట్ బ్లడ్ రిపోర్టు మా అమ్మాయి మార్చిందట'' తన కూతుర్ని చూపిస్తూ అన్నాడు వివేకానంద.

ఏం మాట్లాడాలో తెలియనట్టు కొంచెంసేపు ఇద్దరివైపూ చూస్తూ ఉండిపోయాడు భరద్వాజ. తరువాత లోపలికి తీసుకు వెళ్ళి స్వయంగా ఆమె చేతికి సూదిగుచ్చి రక్తం తీసుకొని ఇంకొకసారి పరీక్షకి పంపాడు. అక్కణ్నుంచి రికార్డ్ రూమ్‌కి వెళ్ళి ఫైళ్ళు తెచ్చాడు. ఆ తరువాత రిపోర్టులమీద ఉన్న పేర్లు పరీక్షించాడు. 'సుజాత' అన్న ఫైల్లో అనూజ్ఞ తాలూకు రిపోర్టు ఉంది. రిపోర్టులు మారినమాట నిజమే కానీ – అవి 'రక్త'పు రిపోర్టులు.

అనూజ్ఞ అతడి అయోమయాన్ని స్పష్టంగా చూస్తోంది. ఆమె ఫైల్లో ఉన్న మిగతా కాగితాలు తీశాడు డాక్టర్ భరద్వాజ. వాటిని పరిశీలిస్తూ కూర్చున్నాడు. అంతలో అప్పుడే తీసిన కొత్త రిపోర్టు కూడా వచ్చింది. వాటిని చూసి, కుర్చీ వెనక్కి వాలి, ''అదీ సంగతి'' అన్నాడు. అతని మొహం ఇప్పుడు రిలాక్సింగ్‌గా ఉంది.

''ఏమైంది డాక్టర్'' అనూజ్ఞ అడిగింది.

''ఆ రోజు మీ రక్తపు రిపోర్టు వచ్చాక నేను ఆందోళన చెందాను. గుర్తుందా?'' ఆమెకు గుర్తులేదు. రిపోర్టు మార్చిన థ్రిల్‌లో ఉన్నదామె. అతను అన్నాడు. ''క్రితం సారి మీ రిపోర్టు చూశాక, 'రండి మీ పరీక్షలు నేను స్వయంగా చేస్తాను' అని లోపలికి తీసుకెళ్ళాను.''

''అవును. మిగతా పరీక్ష మీరే చేశారు గుర్తుంది.''

''మీ రక్తంలో కూడా హడ్జ్కిన్స్ వ్యాధి లక్షణాలున్నాయి అనూజ్ఞా. అందుకే మీ మిగతా పరీక్షలన్నీ నేనే స్వయంగా చేశాను.''

క్లోరోఫాం సిలిండర్ బ్రద్దలైనట్టు ఆ గదంతా ఒక్కసారిగా చల్లబడిన ఫీలింగ్. అప్పటి వరకూ ఆమె చేతి వేళ్ళ మధ్య ఆడుతున్న కాగితం అప్రయత్నంగా బల్లమీదకు జారిపోయింది. దూరంగా గోడమీద ఫోటోలో 'సైలెన్స్' అని వ్రాసి ఉన్నచోట ఒక చిన్న కుర్రవాడు నోటి మీద చూపుడువేలు ఉంచుకుని ''ష్‌ష్...'' అంటున్నాడు.

*అవును. ఇక అంతా నిశ్శబ్దమే. నా మనసు వెక్కిళ్ళ చప్పుడు తప్ప అంతా నిశ్శబ్దమే. ఒక పగలు వెళ్లి ఒక రాత్రి వస్తే– వెళ్ళిపోతున్న 'రోజు'కి గుడ్‌బై చెప్పిన ప్రతిసారీ– బ్రతుకులో కొంతభాగం మాయమైపోవటం కూడా నిశ్శబ్దమే.*

అకస్మాత్తుగా భరద్వాజకు తను చేసిన తప్పు అర్థమైంది. నొచ్చుకుంటూ ''ఐయామ్ సారీ'' అన్నాడు. ఆమె నవ్వింది. ''ఎందుకు సారీ డాక్టర్? ఇదంతా నాకు చెప్పినందుకా? నేను మరణించబోతున్నందుకా?'' అంది.

అతడు మౌనంగా ఊరుకున్నాడు. ఒక డాక్టర్‌గా అతడు గతంలో చాలా మామూలుగా ఇలాంటి వార్తల్ని వెల్లడించాడు కానీ ఇప్పుడు పడినంత బాధ ఇంతకు ముందెన్నడూ లేదు.

ఆమె గాఢంగా ఊపిరి వదిలి ''డాక్టర్, ఈ విషయం మనిద్దరి మధ్యే ఉండాలి'' అంది. అతడు అర్థంకానట్టు చూశాడు. ''అవును డాక్టర్. ఈ విషయం మా వాళ్ళకి తెలియటం వల్ల లాభం ఏముంది?'' బయట కూర్చున్న తండ్రినీ, కార్తికేయనీ దృష్టిలో పెట్టుకుని అంది.

''కానీ వాళ్ళకి చెప్పటం నా బాధ్యత.''

''మరి మొదట్లో నాకెందుకు చెప్పలేదు? నేను బాధపడతాననేగా! ఇప్పుడు నేనూ అదే అంటున్నాను. వారిని అనవసరంగా బాధపెట్టకండి.''

''కానీ''

''వాళ్ళకో న్యాయం, నాకో న్యాయం ఎందుకు డాక్టర్? ఎలాగూ దీనికి మెడిసిన్ లేనప్పుడు వాళ్ళు తెలుసుకుని మాత్రం చేసేది ఏముంది?''

''కానీ పేషెంటుకి కావాల్సిన ఓదార్పు, సపర్యలూ...''

‘‘డాక్టర్–’’ ఆమె అడ్డు తగిలింది. ‘‘నేను ప్రస్తుతం ఒక పుస్తకంలో కవిత్వాన్ని తెలుగులోకి అనువదిస్తున్నాను. ఒక చిన్న అమ్మాయి తనకి కేన్సర్ అన్న విషయం ఇంట్లో తెలియకుండా దాచి పెట్టి తన బాధని కాగితం మీద కవిత్వం రూపంలో బయట పెట్టుకుంది. ఒక చిన్న అమ్మాయే తన జీవితపు చివరి క్షణాలు అంత గొప్పగా బ్రతగ్గలిగినప్పుడు నేనెందుకు ఒకరి సానుభూతిని ఆశించాలి?’’

‘‘కానీ ఇది ఎంతో కాలం దాగదు.’’

‘‘అవసరంలేదు. కొద్దికాలం తెలియకుండా ఉంటే చాలు. ముఖ్యంగా ఒక వ్యక్తికి’’ ఆమె కంఠంలో అలౌకికమైన సంబద్ధత ధ్వనించింది. ‘‘...ఆ వ్యక్తి మీద ఒక మహత్తరమయిన బాధ్యత ఉంది డాక్టర్. ఒక అపూర్వమయిన కళాఖండాన్ని అతడు సృష్టించాలి. ఇప్పుడు నిజమైన ఒక అబద్ధాన్ని అప్పట్లో అతడు నిజమని భావించి, కేన్వాస్‌మీద ఒక్క గీత కూడా గీయలేక పోయాడు. ఇప్పుడీ విషయం నిజంగా నిజమని తెలిస్తే అతడేమీ చిత్రించలేడు. అతడి కోసమైనా ఈ విషయాన్ని దాచిపెట్టాలి. అతన్నించి ఆ చిత్రాన్ని రాబట్టాలి. నా బ్రతుకుకన్నా ఆ చిత్రం ముఖ్యం’’ అంటూ లేచి నిలబడింది.

తరువాత క్షణంలో మామూలు మనిషి అయిపోయి, గోడకున్న నిశ్శబ్దం కుర్రాడి ఫోటో వైపు చూసి, డాక్టరు గమనించకుండా కన్నుకొట్టింది. ష్‌ష్... నిశ్శబ్దం. నీకూ నాకూ మధ్య ఒక రహస్యం గప్ చిప్.

డాక్టర్ తో కలిసి బయటకొచ్చింది.

‘‘పద నాన్నా, బ్రహ్మాండమైన పార్టీ ఇవ్వాలి నాకు.’’

‘‘అంటే? అంటే?’’

‘‘రిపోర్టులు మార్చిన మాట నిజమే’’ కార్తికేయ వైపు చూస్తూ నవ్వింది. అప్పటి వరకూ అతడి మనసులో ఉన్న బాధంతా చేతితో తీసేసినట్టు కనబడ్డాడు. ఒక కూరంగం సంతోషంతో ఎగిరినట్టు, ఒక తరంగం ఆనందంతో అంతరంగాన్ని తాకినట్టు ఆమె ఆశయం నెరవేరింది. ముగ్గురూ బయటకొచ్చారు.

‘‘ఏమిటిద్దరూ అలా కళ్ళప్పగించి చూస్తున్నారు? ఏం మిత్రాజీ! మీరలా ఉన్నారేమిటి? అన్నట్టు నాన్నగారు ఈ సంతోష సమయంలో పార్టీ ఇస్తామన్నారు. మరి మీరేమి చేస్తారు?’’

‘‘ఏం కావాలి అనూజ్ఞా?’’

‘‘తరువాత కాదన కూడదు ప్రామిస్...’’

‘‘ప్రామిస్’’

‘‘ఆ చిత్రం పూర్తి చేయాలి.’’

...

అంతే. అదే జరిగింది. ఆమె కార్తికేయతో చెప్పటం పూర్తిచేసింది.

## 6

**వర్షం** వెలిసింది. పై కప్పుమీది నుంచి పడుతున్న ఒక్కొక్క చుక్కా హృదయం మీద సమ్మెటపోటులా ఉంది. దూరంనుంచి ఏదో బోటు వస్తున్న శబ్దం వినిపిస్తోంది. అతడు కిటికీలోంచి బయట చీకటిలోకి చూస్తున్నాడు. మసక చీకట్లో తడి ఇసుక మెరుపు, విషాదం రంగుకి వైరాగ్యం అంచు వేసినట్టుంది. స్టాండుమీద తడి ఆరని ఒక బొమ్మ. దగ్గరగా ఇటు పక్క... త్వరలో వెలిసిపోయే మరో బొమ్మ.

*ఒక స్వప్నం వస్తావని చెప్పింది. దానికోసం ఎదురుచూస్తుంటే నిద్రే రాలేదు. రాత్రి మాత్రం గడిచిపోయింది. దేవుడా.ఎంత దయలేని వాడివి నువ్వు? కోయిలా, ఎందుకే ఇంత తొందరా? మాఘమాసమింకా రాలేదు కదా. హృదయం – ఎంత చిన్న హృదయం. కృతజ్ఞతనీ, బాధనీ ఒకేసారి నింపుకుని బ్రద్దలైపోయేటంత చిన్న హృదయం.*

కిటికీలోంచి వస్తూన్న గాలికి రెపరెపలాడుతున్న పుస్తకంలో ఆమె అనువదించిన కవిత!

***కిటికీ దగ్గర కుర్చీ వేసుకుని***

***భూమి చివర పడమటి సూర్యుడు మునిగిపోవటాన్ని చూస్తాను.***

***రాత్రి పడుకోబోతూ***

***'మళ్ళీ తూర్పున సూర్యుణ్ణి చూస్తానా'***

***అనుకుంటూ నిద్రపోతాను.***

చదవటం పూర్తిచేసి, అతడు పెదవులు బిగ పట్టాడు. ఆమె నవ్వుతూ దగ్గరకొచ్చి, ''ఏం మిత్రాజీ ఇంతకీ నా ప్రశ్నకి సమాధానం ఏం చేశారు?'' అని అడిగింది.

''ఏం ప్రశ్న?''

''మర్చిపోయారా? మర్చిపోయినట్టు నటిస్తున్నారా, నా భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకునే నా ప్రేమని అంగీకరించడం లేదన్నారుగా. మరిప్పుడు ఏం చెపుతారు?''

దూరంనుంచి వచ్చే బోటు శబ్దం ఒడ్డుకు వచ్చినట్టు ఆగింది. ఒడ్డున ఆగిన బోటువంక కిటికీలో నుండి చూస్తూ ''డాడీ వచ్చేశారు'' అంది అనూజ్ఞ.

కార్తికేయ కూడా అటు చూస్తున్నాడు.

''ఆయన లోపలికి రావటానికి రెండు నిముషాలు పడుతుంది.''

''అయితే?'' అన్నట్టు ఆమె వంక చూశాడు.

''అంతలోగా మీ నిర్ణయం చెప్పరూ?''

అతడు మాట్లాడకుండా మళ్ళీ కిటికీలోంచి చూడసాగాడు.

వివేకానంద మసకచీకట్లో బోటు దిగి గలగల నడుస్తూ రావటం కనిపిస్తోంది.

కార్తికేయనే చూస్తున్న అనూజ్ఞ కళ్ళల్లో ఆతృతలేదు. అలాగని నిర్లిప్తత లేదు. ఏమి వినాల్సి వస్తుందోనన్న ఉద్వేగం ఉంది. అతడు మనసులో ఏదో స్థిరనిర్ణయం చేసుకున్నట్టు పెదవి కదల్చబోయాడు.

"వద్దు... ఏమీ చెప్పవద్దు" అంది హఠాత్తుగా.

"నన్ను చెప్పనీ అనూజ్ఞా!"

"ఒక్క నిమిషం ఆగండి" అంది వారిస్తూ– "ఒకవేళ మీరు తీసుకున్న నిర్ణయం నాకు సంతోషాన్ని కలిగించేదే అయితే, అంత గొప్ప సంతోషాన్ని ఇంత చిన్న గుండెలో దాచుకోలేక పరుగెత్తి వచ్చి, మీ గుండెల్లో ఇమిడిపోయే అవకాశం లేదు. డాడీ వచ్చేస్తున్నారు."

అడుగుల చప్పుడు దగ్గరవసాగింది.

"ఒకవేళ మీ నిర్ణయం విషాదం కలిగించేదయితే, దాన్ని తట్టుకొని డాడీ ముందు మామూలుగా నటించలేను. భరించరాని సంతోషాన్ని, భరించలేని విషాదాన్ని ఆహ్వానించటానికి ఇది సమయం కాదు. అందుకని మనం మళ్ళీ ఇలాగే ఏకాంతంగా కలుసుకున్నప్పుడు... అప్పుడు చెప్పండి, అంతవరకు ఆలోచించండి. మీ గురించి కాదు. నా భవిష్యత్తు గురించి."

లోపలికొస్తూనే వివేకానంద "అనూజ్ఞా..." అని ఏదో అనబోయాడు. ఆయన గొంతులో దుఃఖం అడ్డుపడింది. అది గమనించి అనూజ్ఞ దిగులుగా "నాన్నా" అంది.

"డాక్టర్ భరద్వాజ అంతా చెప్పాడమ్మా" అన్నాడు ఆయన గద్గదికంగా.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments